ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 14 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు	
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.148	220	250
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 25.0

ప్రజల సుఖ సంతోషాల కోసం

సూక్తసహిత మహాలక్ష్మీయాగం



మట్టపల్లి యాజ్ఞశాలలో మహాలక్ష్మీ యాగం నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లోకక్షేమం, ప్రజల సుఖసంతోషాల కోసం వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో శ్రీసూక్తసహిత మహాలక్ష్మీయాగాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. విపత్తులను జయించి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మహాయాగం నిర్వహించినట్లు పండితులు తెలిపారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రాతఃకాలార్చన, సుప్రభాతం, ద్రవిడ ప్రబంధ సేవాలకాలం, మూలవిరాట్ అభిషేకం, అర్చనాదులు, ప్రాభోది, మంత్రపుష్ప నీరాజనం, ఉదయం 9 గంటలకు అమ్మవార్లకు సహస్ర కంకుమార్చన, అనంతరం శ్రీసూక్త సహిత మహాలక్ష్మీయాగం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు పవిత్ర కృష్ణానదీలో హంసవాహన ఉత్సవం, విద్యుత్, పూల అలంకరణతో వైభవంగా నిర్వహించారు. సప్తర్షి పూజ, సదస్య మహోత్సవం, మహదాశీర్వచన, ఫలప్రదాన మహోత్సవం కొనసాగాయి. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, శ్రీనివాసరావు, సీత, రాజేష్, రమేష్, దేవస్థాన పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. రాజష్, రమేష్ దేవస్థాన పాలక మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విత్తన పంపిణీకి

సమాయత్తం

- నేటి నుంచి పంపిణీకి సన్నాహాలు
- జిల్లాకు 1500 క్వింటాళ్ల కేటాయింపు

7లో

తీరుమారని పోలీస్



జిల్లాలోని కొంతమంది పోలీసు అధికారులు ఉద్యోగం చేస్తున్నదే అక్రమంగా డబ్బు సంపాదించేందుకు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అవినీతే ధ్యేయంగా వారు పనిచేసిన ప్రతీచోటా పెద్దమొత్తంలో డబ్బులు అక్రమంగా సంపాదిస్తున్నారు. అధికారాలను అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళితే జేబులు ఖాళీ కావాల్సిందే. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజూ ఏదో ఓ చోట అధికారులు ఏసీబీ వలలో చిక్కడం, వారి ఆస్తులపై దాడులు చేస్తున్నా మిగతా వారిలో మార్పు కనిపించడం లేదు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

- ధనార్జనే ధ్యేయంగా విధులు
- ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
- ఇటీవల ఏసీబీకి చిక్కిన చింతలపాలెం ఎస్ఐ
- తాజాగా సూర్యాపేట డీఎస్పీ, సీఐ



పోలీస్‌స్టేషన్ల నిర్వహణ కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్టేషనరి, ఇతర ఖర్చులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతీ స్టేషన్‌కు నేరాల నమోదు సంఖ్యను బట్టి నెలనెలా ఖర్చులకు నిధులు అందించేవారు. అందులో భాగంగా పట్టణ పోలీస్‌స్టేషన్లు నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, భువనగిరి, నకిరేకల్, హుజూర్‌నగర్, దేవరకొండ, యాదగిరిగుట్ట స్టేషన్లకు నెలకు రూ.50 వేలు, మిగతా స్టేషన్లకు నెలకు రు.25వేల చొప్పున అందిస్తున్నారు. అయినప్పటికీ వివిధ సాకులతో స్టేషన్‌కు వెళ్లిన వారి నుంచి వసూలు చేస్తున్నారు.

కొంతమందిపై వేటు...

జిల్లాలో అవినీతి, అక్రమాలకు కారణమవుతున్న కొందరిపై పోలీస్ అధికారులు గతంలో వేటువేశారు. అయినప్పటికీ మిగతా వారు అవినీతికి పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలువురు పోలీసులపై చర్యలు తీసుకున్నారు. తన హయాంలో ఏడుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. మేళ్లచెర్వు, గరిడేపల్లిలో ముగ్గురు కానిస్టేబుళ్ళ, సూర్యాపేటలో ఇసుక అక్రమ రవాణాకు సహకరించిన ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. బైక్ చోరీ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏఆర్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

జిల్లాలోని ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్, తుంగతుర్తి ఎస్ఐలు అక్రమ వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నారనే సమాచారంతో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ వారిని వీఆర్‌కు అటాచ్ చేశారు. ఈ మధ్యన అవినీతి ఆరోపణలు, ఇతర కారణాలతో మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులను సస్పెండ్‌చేశారు. గతంలో కూడా సదరు ఎస్ఐపై పోలీస్ ఉన్నతాదికారులు చర్యలు చేపట్టారు.

నల్లగొండ జిల్లాలో కూడా పలువురు ఎస్ఐలు అక్రమ వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నారని వారిని వీఆర్‌కు అటాచ్ చేశారు. గుర్రంపోడు ఎస్ఐ ఓ హత్య కేసును తప్పుదోవ పట్టించాడనే కారణంతో ఎస్ఐతో పాటు సహకరించిన కానిస్టేబుల్‌ను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ సస్పెండ్ చేశారు. అయినప్పటికీ పోలీసుల్లో ఇంకా మార్పురావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అక్రమ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ...

జిల్లాలో అక్రమవ్యాపారాలను కొంతమంది పోలీసులు ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ముఖ్యంగా ఇసుక, పీడీఎస్ బియ్యం, నల్లబెల్లం, నకిలీ టీ పొడి వ్యాపారాలు ఎక్కువగా సాగుతున్నాయి. అయితే వ్యాపారుల నుంచి ఆయా స్టేషన్లపరిధిలోని సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో మామూళ్ల వసూలు చేయిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా సరిహద్దులోని కృష్ణా పరివాహక ప్రాంతాలైన హుజూర్‌నగర్, పాలకవీడు, నేరేడుచర్ల, మఠంపల్లి, చింతలపాలెం, మేళ్లచెర్వులతో పాటు తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, చివ్వెంల మండలాల పరిధిలో నల్లబెల్లం, రేషన్ బియ్యం, ఇసుక, గుట్కా అక్రమ వ్యాపారాలు ఎక్కువగా సాగుతున్నట్లు సమాచారం. రాజకీయ అండదండలు ఉన్న పోలీస్ అధికారుల ఆదేశాలను ఎస్ఐలు, సిబ్బంది తూ.చా. తప్పకుండా పాటించాల్సి వస్తోంది. పైఅధికారుల ఒత్తిళ్లతో నిక్కచ్చిగా ఉందామనుకున్న కొందరు ఎస్ఐలు కూడా ఈ రొంపిలోకి దిగాల్సి వస్తోంది. మరికొందరు అవినీతికి పాల్పడలేక ఎస్‌హెచ్‌వో పోస్టింగ్‌లను వదులుకొని లూప్‌లైన్ పోస్టింగ్‌లకు వెళ్తున్న సందర్భలూ ఉన్నాయి.

ఏసీబీకి పట్టుబడుతున్న పోలీసులు

జిల్లాలో పోలీస్ అధికారులు, సిబ్బందిని తాళలేక కొందరు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. దీంతో ఏసీబీ అధికారులకు పట్టుబడి జైలుకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో 2022లో సూర్యాపేట రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పలు ఆరోపణలతో బదిలీ అయిన ఎస్ఐ ఓ హోటల్ నిర్వాహకుల నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రస్తుతం ఆ ఎస్ఐ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్ఐగా పనిచేస్తున్నారు.

తాజాగా సూర్యాపేట డీఎస్పీ పార్థసారధి, సూర్యాపేట పట్టణ సీఐ వీరరాఘవులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ వైద్యుడిని రూ.16లక్షలు ఇవ్వాలని లేదంటే కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తామని బెదిరించడంతో చేసేది లేక వైద్యుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వైద్యుడిపై డబ్బుల కోసం ఒత్తిడి తెచ్చింది నిజమేనని నిర్ధారణ కావడంతో డీఎస్పీతో పాటు సీఐపై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేసి జైలుకు పంపారు.

ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నా...

జిల్లాలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కొంతమంది పోలీస్ అధికారులు, సిబ్బందిపై రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు వేటు వేస్తున్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న వ్యవహారాలపై ఎప్పటికప్పుడు రహస్యంగా నివేదికలు తెప్పించుకుంటున్నారు. అంతేకాక స్టేషన్లకు వచ్చి

(మిగతా 8వ పేజీలో)

పోస్టింగ్‌ల కోసం డబ్బులు

కొంతమంది పోలీస్ అధికారులు లా అండ్ ఆర్డర్ పోస్టింగ్‌ల కోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒక్కో పోలీస్‌స్టేషన్‌ను బట్టి ఎస్ఐ పోస్టింగ్‌కు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు, అదే సీఐ పోస్టింగ్ కోసం రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు, డీఎస్పీ పోస్టింగ్ కోసం రూ.20 లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత ఖర్చు పెట్టి పోస్టింగ్ తెచ్చుకున్న వారు తిరిగి రాబట్టుకునేందుకు అవినీతికి పాల్పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు.

ఒక్కో కేసుకు ఖరీదు

6లో

కేసుల పరిష్కారంలో న్యాయవాదుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డిస్టిక్ జడ్జి లక్ష్మీశారద

సూర్యాపేటలీగల్ , మే 13(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారంలో న్యాయవాదుల పాత్ర కీలకమని ప్రిన్సిపల్ డిస్టిక్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద అన్నారు. సూర్యాపేట కోర్టు ప్రాంగణంలో జూన్ 14వ తేదీన నిర్వహించనున్న లోక్‌అదాలత్ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించి కేసును రాజీపూర్వక పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు.

ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఫాతిమా కౌసర్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్. అపూర్వరవళి, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె. రమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు పాల్గొన్నారు.

అర్హత లేని వ్యక్తులు వైద్యం చేస్తే క్రిమినల్ చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అర్హత లేకుండా ఎవరైనా వైద్య సేవలందిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం, ఐఎంఏ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తిపై సమాజంలో గౌరవం ఉందని, ఆ వృత్తిపై ప్రజలు నమ్మకం కోల్పోకుండా వైద్యులు బాధ్యతగా మెలగాలన్నారు. అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా చలామణి అవుతూ నకిలీ డిగ్రీలతో క్షేత్రస్థాయిలో చికిత్సలు అందిస్తున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. డీఎంహెచ్‌వో, ఐఎంఏ ప్రతినిధులు మూడు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. ఆస్పత్రులను వైద్యులు ఏసమయాల్లో సందర్శిస్తారో ఆ వివరాలను తెలియజేయాలన్నారు. సాయిగణేష్ ఆస్పత్రి, శ్రీకృష్ణ ఆస్పత్రిపై ఆర్డీవో అధ్యక్షతన వైద్యబృందంతో ఏర్పాటుచేసిన కమిటీ విచారణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గాజుల చంద్రశేఖర్, జయమనోహరి, డాక్టర్ అనితారాణి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్లు ఘంటా దయాకర్‌రెడ్డి, లకావత్ రమేష్‌నాయక్, ఆనంద్‌దాడ్లే, శ్రీరామ్, అనూష, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి డాక్టర్ రాజీవ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

ప్రతీ ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేసి పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా చూడాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం దురాజ్‌పల్లి వద్ద గల స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో జిల్లాలోని ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన ఐదు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించి, మాట్లాడారు. విద్యా సంవత్సరానికి ప్రత్యేక ప్రణాళికలు రచించి ఆగస్టు 15వ తేదీలోగా ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్‌కుమార్, కోఆర్డినేటర్లు జనార్ధన్, పూలమ్మ, స్వామి నారాయణ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఆర్‌పీ రాంబాబు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ధాన్యం సేకరణ

నాగారం:ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం వర్ధమానుకోట, నాగారం బంగ్లా గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రకియను ఆయన పరిశీలించారు. తూకాలను, రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. నాగారం బంగ్లా వద్ద వాసవీ, వసుధ రైస్‌మిల్లులో ధాన్యం దిగుమతిని పరిశీలించారు. త్వరగా ధాన్యాన్ని దిగుమతులు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయిస్ మేనేజర్ ప్రసాద్, తహసీల్దార్ బ్రహ్మయ్య, గిర్దావర్ అల్లావుద్దిన్, ఏవో కృష్ణకాంత్, ఏపీఎం శోభ ఉన్నారు.

ప్రశాంతంగా పాలీసెట్ పరీక్ష



సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో జిల్లా కోఆర్డినేటర్ సుజాత, మిగతా అధికారులు

భానుపురి, మే 13 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ పరీక్ష సూర్యాపేటలో మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఏ, బీ సెంటర్లు, ఎస్వీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్‌కేఏ లికే డిగ్రీ, పీజీ కళాశాల, శ్రీమేధా జూనియర్ కళాశాల, శ్రీనిధి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లలో విద్యార్థులు పరీక్ష రాశారు. 1,436 మంది బాలురు, 1,362 మంది బాలిక లు, మొత్తం 2,798 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. 1,330 మంది బా లురు, 1,260 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 106 మంది బాలురు, 102 బాలికలు పరీక్షకు గైర్హాజరయ్యారని పాలిసెట్ కోఆర్డినేటర్ కె. సుజాత తెలిపారు.

తిరుమలగిరి: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష తిరుమలగిరిలో ప్రశాంతంగా ముగిసింది. మునిసిపల్ కేంద్రంలోని పాల్‌టెక్నిక్ కళాశాలలో 350 విద్యార్థులకు 321 మంది హా జరైనట్లు ప్రిన్సిపాల్ మంజాల సత్తయ్య తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



హుజూర్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఆర్‌వీకెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.కరెంట్‌రావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ట్రాన్స్‌కో విద్యుత్ కార్యాలయం ఎదుట టీఆర్‌వీకెఎస్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు.2023 జేఎల్‌ఎం బ్యాచ్ పేస్కేల్ వ్యత్యాసాన్ని సరిచేసేందుకు యాజమాన్యంతో చర్చలు చేస్తామన్నారు. సబ్ ఇంజనీరింగ్ స్క్రీనింగ్ టెస్ట్ కూడా మల్టీపుల్ ఛాయిస్‌లో ఇచ్చే విధంగా ఒప్పిస్తామన్నారు. ఈపీఎఫ్, జీపీఎఫ్ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పోతురాజు రమేష్‌బాబు, విశ్వనాథచారి, పిన్నని కోటేశ్వరరావు, ప్రభావతి, జగదీష్, వెంకటేశ్వరరావు, శ్రీను, రాము, బాబు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న నేరాలకు సంబంధించి పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో నేరస్థులకు శిక్షలు పడాలంటే కోర్టు డ్యూటీ నిర్వహించే పోలీసులు కోర్టు అధికారులతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్ రెడ్డితో కలిసి జిల్లాలో కోర్టు డ్యూటీ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల్లో నిందితులను దోషులుగా నిరూపించి శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు దర్యాప్తు చేయాలన్నారు. సాక్షులు, నిందితులు, బాధితులను సమయానికి కోర్టుల్లో హాజరు పరచాలన్నారు. ఆధారాలు, సాక్ష్యాలను పక్కాగా నమోదు, భద్రపరచడం ముఖ్యమన్నారు. కేసుల్లో నిందితులకు శిక్షలు పడితేనే నేరాలు నియంత్రణలోకి వస్తాయన్నారు. కేసుల దర్యాప్తు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, ఎస్‌బీఐ నాగభూషణరావు, డీసీఆర్‌బీ సీఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని స్థానికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం బాలాజీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ మొదలుకొని నేటి రాహుల్‌గాంధీ వరకూ పేదల కోసం నిరంతరం పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తమ ప్రాణాలు లెక్కచేయకుండా దేశ ప్రజల కోసం పనిచేసిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల స్ఫూర్తితో కార్యకర్తలు పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళినాయక్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో నిరంతరం పనిచేసిన కార్యకర్తలను పార్టీ మరిచిపోదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ, రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసాలాంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు చక్రరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, జిల్లా ఉపాధ్యక్షుడు యోగానందచార్యులు, వివిధమండలాల అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల కన్వీనర్ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు నరేష్, జుమిలాల్, అంబేడ్కర్, జనార్ధన్, వీరేష్ పాల్గొన్నారు.

నిరసన : సమావేశం అనంతరం ఎమ్మెల్యే సామేల్ వెళ్లిపోగానే పరిశీలకులుగా వచ్చిన మురళినాయక్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న వాహనాలను కార్యకర్తలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిజమైన కార్యకర్తలకు అన్యాయం చేస్తూ కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. పార్టీని నాశనం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వాహనాల ముందు బైఠాయించారు. ఎమ్మెల్యే మురళీనాయక్, చెవిటి వెంకన్నలు మాట్లాడుతూ ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి, కార్యకర్తలకు సరైన న్యాయం చేస్తామని హామి ఇచ్చి సమస్యను పరిష్కరించారు.

భూదాన్‌పోచంపల్లికి విశ్వఖ్యాతి!

'భూదాన్‌పోచంపల్లి అనగానే మగువలు మెచ్చే పట్టుచీరలకు నిలయం. సిల్క్‌సిటీ ఆఫ్ పోచంపల్లిగా ప్రసిద్ధి. దేశంలోనే మొదటిసారిగా భూదానం జరగడంతో భూదాన్ గంగోత్రిగానూ ప్రపంచ ప్రసిద్ధి. ఈ అంశాలే పోచంపల్లిని ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఐక్యరాజ్యసమితి అనుబంధంగా పనిచేస్తున్న ప్రపంచ పర్యాటక సంస్థ(యూఎన్‌డబ్ల్యుటీవో) నిర్వహించిన 'బెస్ట్ టూరిజం విలేజ్' పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి విశ్వఖ్యాతి పొందింది. అదే కోవలో ప్రపంచ సుందరీమణుల రాకతో మరోసారి విశ్వవ్యాప్త దృష్టిని ఆకర్షిస్తోంది."

- (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)



- చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు
- భూదాన ఉద్యమానికి నాంది పలికిన నేల
- ప్రపంచ పర్యాటక గ్రామంగా గుర్తింపు

భూదానోద్యమ స్ఫూర్తి, ఇక్కత్ పట్టు చీరల తయారీకి ప్రసిద్ధి చెంది, దేశ, విదేశీయుల మనసు దోచిన పల్లె భూదాన్‌పోచంపల్లి. పేదలకు భూమిని పంచిన ఆచార్య వినోబాభావే నడయాడిన నేల ఇది. గ్రామీణ జీవనశైలి, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం ఈ గ్రామం. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటూ ఆహ్లాదపరుస్తోంది. ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉండే భూదాన్ పోచంపల్లిని సందర్శించేందుకు ఈ నెల 15న ప్రపంచ సుందీరమణులు రానున్నారు.

ఘనమైన చరిత్ర

ఊరంటే చెట్టు, చేమ, మళ్లు, చెరువులు, చెలకలు, పాడి పశువులు, గుడి, బడి ఇలా వాటితో పెనవేసుకున్న మనుషులు. వీటన్నింటితో పాటు పోచంపల్లికి అత్యంత గుర్తింపు తెచ్చిన మరొకటి చేనేత. పడుగు, పేకలతో చేనేత టై అండ్ డై ఇక్కత్ పట్టు వస్త్రాల తయారీకి పుట్టిల్లు ఈ గ్రామం. దీంతో సిల్క్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరొందింది. చేనేత వస్త్రాలకు ఆలవాలం కాకముందు గాజులు, పూసల తయారీకి ప్రసిద్ధి చెందినదిగా చెబుతుంటారు. అందుకే దీనికి 'గాజుల పూసలపల్లి'గా పేరు. ఉచ్ఛరణలో రానురాను గాజులపోచంపల్లిగా అయ్యింది. భూదానోద్యమం మహోద్యమానికి అంకురార్పణ జరిగిన క్రమంలో భూదాన్‌పోచంపల్లిగా పేరొందింది.



వినోబాభావే స్ఫూర్తితో భూదానోద్యమం

మహాత్మాగాంధీ ప్రియశిష్యుడైన ఆచార్య వినోబాభావే 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఆ సమయంలో నల్లగొండ జిల్లాలో జరుగుతున్న కల్లోల పరిస్థితులను తెలుసుకొని పరిష్కారమార్గాన్ని వెతకడానికి పాదయాత్రగా పోచంపల్లికి చేరుకున్నారు. ఏప్రిల్ 18న దళితులతో సమావేశమయ్యారు. తమకు కొంత భూమిని ఇప్పిస్తే సాగుచేసుకుని జీవిస్తామని గోడును వెల్లబోసుకున్నారు. దీంతో వినోబాభావే స్పందిస్తూ మీలో ఎవరైనా భూమి దానం చేసేవారున్నారా? అని అడగడంతో అక్కడే ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల భూమి దానం చేస్తానని ప్రకటించారు. అక్కడికక్కడే దానపత్రం నిండు సభలో వినోబాభావేకు అందజేశారు. దానరూపేణ ఇచ్చిన భూమిని వెంటనే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. వినోబాజీ పాదయాత్ర కాస్త 'భూదానయాత్ర'గా మారింది. దేశవ్యాప్తంగా 44లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు పంచారు.

అరబ్ దేశాలకు రుమాళ్లు

అసఫ్‌జాహీల పాలన కాలం నాటికే చేనేత మగ్గాల సవ్వడిని వింటూ ఉంది పోచంపల్లి. అద్భుతమైన వస్త్రనేత కళాకారులకు పెద్దపీట వేసింది. 1910 నాటికే ఇక్కడ చిటికి పరిశ్రమ ఏర్పాటైంది. ఇరవై నెంబరు నూలుతో 'తేలియా రుమాళ్లు' నేసేవారు. వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిపోయే అరబ్బులు వీటిని ఇష్టపడి కొనుగోలు చేసేవారు. ఆ తరువాత తేలియా రుమాళ్లను అరబ్ దేశాలకు ఎగుమతి చేయడం ఆరంభించారు.


పట్టుకు పెట్టింది పేరు

తేలియా రుమాళ్ల తర్వాత కాటన్ వస్త్రాల తయారీ ఇక్కడ సాగింది. ఈ గ్రామానికి కర్నాటి అనంతరాములు, తడక పెద్ద యాదగిరి అనే చేనేత కళాకారులు 60 నెంబరు నూలుతో పడుగు, పేకలతో సహజ రంగుల్లో చీరలను నేశారు. 1956లో పోచంపల్లిని సందర్శించిన ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు ప్రెసిడెంట్ కమలాబాయి ఛటోపాధ్యాయ చిన్న తరహాపరిశ్రమ డైరెక్టర్ దయారాం కాటన్ మాదిరిగానే పట్టుచీరలను తయారుచేయమని వారిని కోరారు. వారి కోరిక మేరకు అనంత రాములు, పెద్ద యాదగిరి ఇద్దరూ బనారస్ వెళ్లి అక్కడ ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం కర్నాటి అనంతరాములుతో పాటు భిక్షపతి, కర్నాటి వాసుదేవ్ తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం వెళ్లి రంగుల అద్దకంలో శిక్షణ పొందారు. ఆ తర్వాత పోచంపల్లికి వచ్చి మొట్టమొదటిసారిగా 1958లో కర్నాటి అనంతరాములు మగ్గంపై పోచంపల్లి చేనేత టైఅండ్డై ఇక్కత్ చీరను నేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే చేనేత సంప్రదాయక వృత్తి నైపుణ్యాలను చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన అవసరాన్ని డబ్ల్యుటీవో గుర్తించింది. 1999లో జియోగ్రాఫికల్ ఇంటికేషన్ ఆఫ్ గూడ్స్ చట్టం చేశారు. దీని ద్వారా ఒక ప్రాంతంలో తయారైన వస్తువులకు రక్షణ కల్పించవచ్చు. ట్రాప్స్‌లోని ఆర్టికల్ 22 నుంచి 24 వరకు వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన అంశాలుంటాయి. వాటి ఆధారంతో వస్త్రాల తయారీకి విశిష్టతను గుర్తించిన ప్రభుత్వం 2003లో పేటెంట్ హక్కును (జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ) కల్పించింది. దీంతో చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావడంతో చేనేత కార్మికుల ప్రతిభకు విశ్వవ్యాప్త గుర్తింపు లభించింది.

సినిమా షూటింగ్, షార్ట్ ఫిల్మ్స్‌కు కేరాఫ్

ఎటుచూసినా పచ్చని పంట పొలాలు. మూసీ పరివాహకంలోని వరి చేలు, చెరువులు, గుట్టలతో అందమై న లొకేషన్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో కోనసీమ ను తలపించే ఈ ప్రాంతంలో సినిమా షూటింగ్‌లకు, షార్ట్ ఫిలింలకు కేరాఫ్ అడ్రస్‌గా పోచంపల్లి మారింది. షూటింగ్‌లకు మొదట క్లాప్ కొట్టి యాక్షన్ చెప్పింది ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్. 1986లో సుస్మాన్ సినిమా షూటింగ్ కోసం పోచంపల్లికి ఆయన హీరోయిన్ షబనా ఆజ్మీతో సహా ఆ సినిమా యూనిట్ మొత్తం పోచంపల్లిలోనే నెలరోజుకుపైగా బసచేశారు. ప్రముఖ నటుడు ఓంపురి కూడా ఇక్కడికి వచ్చి చేనేత పని నేర్చుకున్నారు. అలా సుస్మాన్‌తో మొదలై నేటి వరకు ఎన్నో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాలు, పలు సీరియల్స్, డాక్యుమెంటరీల షూటింగ్‌లు నేటికీ నిత్యం జరుగుతున్నాయి.

ప్రపంచ సుందరీమణుల సందర్శనతో 'పోచంపల్లి ఇక్కత్'కు మరింత ప్రాచుర్యం



పోచంపల్లి చేనేత టైఅండ్డై ఇక్కత్ వస్త్రాలకు ఇప్పటికే ఖండాంతర ఖ్యాతి ఉంది. కాగా, ఈనెల 15న పోచంపల్లికి ప్రపంచ సుందరీమణులు సందర్శించి చేనేత థీమ్‌పై విస్తృత ప్రచారం చేయనున్నారు. దీంతో దేశ విదేశాల్లో పోచంపల్లి ఇక్కత్‌కు బ్రాండ్ ఇమేజ్ మరింత పెరగనున్నది.

- తడక రమేష్, పోచంపల్లి చేనేత టైఅండ్డై అసోసియేషన్ ట్రస్ట్ చైర్మన్ తడక రమేష్

సుందరీమణుల రాకతో మరింత ప్రాచుర్యం



భూదాన్‌పోచంపల్లికి ఈనెల 15న ప్రపంచ సుందరీమణులు వస్తున్న నేపథ్యంలో పోచంపల్లి ఖ్యాతి ప్రపంచదేశాలకు ప్రాచుర్యం పొందనున్నది. ఇక్కడిఇక్కత్ పట్టు చీరలకు మంచి గుర్తింపు లభించనుంది. ఇప్పటికే చేనేత పరిశ్రమతో పాటు భూదానోద్యమానికి నాంది పలికి పేరొందిన పోచంపల్లి ప్రపంచ సుందరీమణుల సందర్శనతో మరింత పేరు లభించనుంది.

- మెరుగు శశికళ, జిల్లా చేనేత నాయకురాలు

పర్యాటకానికి రంగులు అద్దిన ఊరు

వినోబాభావే సందర్శనతో భూదానోద్యమానికి నాంది పలికింది పోచంపల్లి. దీంతో ఈ ఊరికి చారిత్రక ప్రాశస్త్యాన్ని కల్పించింది. చేనేత, భూదానోద్యమం ద్వారా పోచంపల్లి ఓ పర్యాటక పల్లెగా మారింది. చేనేత మార్కెటింగ్ కోసం వచ్చిపోయే వ్యాపారులు, కొనుగోలుదారులతో పాటు ఆచార్య వినోబాభావే నడయాడిన నేల, ఆయన కూర్చున్న జువ్విచెట్టు, ఆయన బసచేసిన చోటు వినోబా మందిరంగా నిలిచింది. పూర్వం దొరల కాలంలో సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిర్మించిన 101 దర్వాజల భవనాన్ని సందర్శించేందుకు ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. 2007లో రూ.3.75 కోట్లతో ఇక్కడ గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. రూరల్ టూరిజం సెంటర్ నేడు విదేశీయులకు అధ్యయన కేంద్రంగా మారింది. గతంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోచంపల్లి టూరిజం పార్క్‌లో మేళాలను నిర్వహించారు. ఇందులో చేనేత వస్త్రాల ప్రదర్శన, హ్యాండీక్రాఫ్ట్స్, గ్రామీణ వంటకాల రుచులు, గ్రామీణ కళల్లో భాగంగా గంగిరెద్దుల ఆట, డప్పు కళాకారుల ఆటపాట, ఒగ్గు కళారూపాలను ప్రదర్శించి అలరించారు. భూదాన్‌పోచంపల్లిలోని చేనేత పట్టు చీరలకు ప్రాచుర్యం కల్పించేందుకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు స్థానిక టూరిజం పార్క్‌లో 2008లో ఫ్యాషన్ షోను ప్రదర్శించారు. ప్రముఖ నటి శోభనతో పాటు పలువురు మోడల్స్ పోచంల్లి ఇక్కత్ వస్త్రాలతో ఫ్యాషన్ షో నిర్వహించి పర్యాటకులను ఆకట్టుకున్నారు.



విషజ్వరంతో విద్యార్థిని మృతి



సహస్ర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, సహస్ర(ఫైల్‌ఫొటో)

యాదగిరిగుట్ట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో విద్యార్థిని మృతితో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సొన్నాయిల రమేష్ కుమార్తె సహస్ర(13) ఈ నెల 11న విపరీతమైన జ్వరానికి గురైంది. దీంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. రెండు రోజులు చికిత్సపొందుతూ ఈ నెల 12న మృతి చెందింది. ఇప్పటివరకు సహస్రకు ఎలాంటి జబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల్లో కొందరు విషజ్వరంతో బాధపడుతున్న వారు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అయితే విషజ్వరాలతో గ్రామస్థులు బాధపడుతున్నా వైద్యులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


సహస్ర కుటుంబాన్ని పరామర్శించిన మహేందర్‌రెడ్డి

పెద్దకందుకూర్‌లో సహస్ర మృతదేహంపై డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతికిగల కారణాలను అగిడి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఇంటింటి సర్వే చేయిస్తున్నాం : మెడికల్ ఆఫీసర్ పావని

పెద్దకందుకూర్ గ్రామంలో సిబ్బందితో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని మెడికల్‌ఆఫీసర్ పావని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు వారికి సలహాలు సూచనలు చేస్తున్నామన్నారు. మృతి చెందిన విద్యార్థి సహస్ర పీహెచ్‌సీకి రాలేదని, గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

బత్తాయి చెట్లు దగ్ధం



చెట్లు కాలిపోయిన ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

పెద్దఅడిశర్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామ శివారులో మంగళవారం బత్తాయి తోట దగ్ధమైంది. బాధిత రైతుల వివరాల ప్రకారం పీఏపల్లి గ్రామానికి చెందిన నారాయణ శ్రీనివాస్ 30 చెట్లు, ఏరుకొండ లింగయ్యకు చెందిన 30, గణపురం సంతోష్‌కు చెందిన 5 చెట్లు సమీపంలోని రైతులు వరి కొయ్యలు కాల్చడంతో ఎండకు పక్కనే ఉన్న బత్తాయి చెట్లకు అంటుకున్నాయి. దీంతో చెట్లు దగ్ధమైనట్లు వారు తెలిపారు. మిగతా చెట్లకు వ్యాపించకుండా అప్రమత్తమైన రైతులు వెంటనే మంటలు ఆర్పివేశారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఘటన స్థలాన్ని సందర్శించి, పంచనామా నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా చెట్లను కాపాడుకుంటూ వస్తున్నామని, చెట్లు కాలిపోవడంతో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వీధికుక్కల దాడిలో లేగ దూడ మృతి

ఆలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో లేగదూడె మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో సోమరాజు బావిగూడెం వద్ద జరిగింది. స్థానిక రైతు గంగధారి అంజయ్య తన వ్యవసాయ బావి వద్ద పశువుల కొట్టంలో పాడి ఆవులు, గేదెలు, లేగ దూడెలను సోమవారం రాత్రి కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం కొన్ని వీధికుక్కలు లేగ దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో లేగ దూడ అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామంలో అధికంగా ఉన్న వీధికుక్కలను తక్షణమే నివారించే చర్యలు చేపట్టాలని రైతులు అధికారులను కోరారు.

ఒక్కో కేసుకు ఖరీదు

- పోలీసుల డిమాండ్లతో భయం
- సూర్యాపేట ఘటనతో సర్వత్రా చర్చనీయాంశం

మోత్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీకి మారుపేరుగా ఉండాల్సిన పోలీసు శాఖలో కొందరు అవినీతి మరకలంటించుకుంటున్నారు. అక్రమార్కులతో పోలీసులే లాలూచి పడి అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నేరారోపణ ఎదుర్కొంటున్న వారు సైతం పోలీసుల అత్యాశకు బెదిరి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ చిక్కుతున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. తాజాగా సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకుల నుంచి రూ.16 లక్షలు డిమాండ్ చేసిన కేసులో డీఎస్పీ పార్థసారధి, సీఐ వీరరాఘవులు ఏసీబీకి పట్టుబట్టారు. దీంతో పోలీసుల తీరు చర్చనీయాంశమైంది. అక్రమ వసూళ్లలో పోలీసులు తమ తీరును మార్చుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు ఈ ఏడాది ఏసీబీకి చిక్కారు. జనవరి 12న తిరుమలగిరి పోలీసులు వాహనాల తనిఖీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. విచారణలో సిద్ధిపేట జిల్లా రాయికల్ మండలం వడ్డెపల్లి గ్రామానికి చెందిన రైస్‌మిల్ వ్యాపారి చంద్రశేఖర్‌గా పేరు చెప్పారు. తిరుమలగిరి ఎస్‌ఐ సురేష్ రైస్‌మిల్ వ్యాపారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కేసు నుంచి తప్పించడానికి రూ.3లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి రూ.లక్షా 40వేలకు డీల్ కుదుర్చుకున్నాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించి ఎస్‌ఐని, కానిస్టేబుల్‌ను పట్టించాడు. దీంతో వారు ఎస్‌ఐ, కానిస్టేబుల్‌ను కస్టడీలోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఆలేరు రూరల్: ఆలేరు నియోజకవర్గంలో గుండాల పోలీస్‌స్టేషన్ మినహాయించి మిగతా పోలీస్‌స్టేషన్లలో రెండేళ్లుగా ఏసీబీ దాడులు జరుగలేదు. 2020లో అప్పటి గుండాల ఎస్‌ఐ చందర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. రేషన్ బియ్యం కేసులో పట్టుబడిన వ్యాన్‌ను విడిపించేందు కోసం బాధితుడి నుంచి రూ.50వేలు లంచం అడగగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ప్రస్తుతం ఆయన వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే కొన్ని స్టేషన్లలో మామూలు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం కొందరిని నియమించినట్లు సమాచారం.



తిరుమలగిరిలో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు(ఫైల్‌ఫొటో)

● అక్రమార్కులకు వత్తాసు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లలో ప్రతీ పనికి రేటు నిర్ణయిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఎస్‌ఐలు అవినీతి సంపాదనకు అలవాటు పడి అక్రమాలకు తెరలేపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్రమార్జన కోసం రేషన్‌బియ్యం, ఇసుకఅక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. 2024 అక్టోబరు 23న ఓ కేసులో రూ.10వేలు లంచం తీసుకుంటూ చింతలపాలెం ఎస్‌ఐ అంతిరెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు.అయినా ఇతరుల్లో మార్పురాలేదు.ఒక్కో కేసుకు రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఎస్‌ఐలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● హుజూర్‌నగర్ ప్రాంతంలో ఓ కేసులో బాధితురాలిని రాజీకి కుదుర్చిన ఎస్‌ఐ ఉదంతం బాధిత మహిళ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కాళ్లపై పడి తెలపడంతో అంతా నివ్వెరపోయారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌ను మరికొంతమంది అదేరంగంలోని వారు నమ్మించి మోసగించడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో పోలీసులకు రూ.10 లక్షల వరకు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.నిందితులపై కేసులు పెట్టకుండా ఫిర్యాదుదారురాలిని మోసం చేసిన అధికారులు చివరికి బాధితురాలికి రూ.6 లక్షలు ఇప్పించి కేసు రాజీ చేసినట్లు సమాచారం. ఒక్కటి కాదు, రెండు కాదు, వందల కేసుల్లో పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా ఉంటూ తప్పుడు కేసులు బనాయిస్తు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరిచయం పెంచుకుని నకిలీ బంగారంతో మోసం

మేళ్లచెర్వు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పరిచయం పెంచుకుని నకిలీ బంగారం విక్రయించిన ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలో జరిగింది. బాధితులు, ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం నెల రోజుల క్రితం పావురాలు, కౌజుపిట్టలు పట్టే ముగ్గురు మేళ్లచెర్వు మండలకేంద్రానికి చెందిన శంభిరెడ్డికి పరిచమయ్యారు. తాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన వాళ్లమని పిట్టలు పట్టుకొని జీవనం సాగిస్తామని, తక్కువ ధరకు అందిస్తామని తెలిపి ఫోన్‌నెంబర్ తీసుకొని ఒకటి, రెండుసార్లు కౌజు పిట్టలను అందించి పరిచయం పెంచుకున్నారు. 20 రోజుల క్రితం తమ సమీప బంధువు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా అతడికి వ్యవసాయ పొలంలో భారీగా బంగారం దొరికిందని, కావాల్సిన వారికి తక్కువ ధరకు అందిస్తామని పదేపదే శంభిరెడ్డికి ఫోన్ చేశారు. 15 రోజుల కిందట సదరు వ్యక్తుల ఫోన్‌కు స్పందించిన శంభిరెడ్డి అనంతపురం జిల్లా వెళ్లగా ఆయనకు శాంపిల్‌గా కొంత బంగారం ఉచితంగా అందజేశారు. ఆ బంగారాన్ని ఆయన మేళ్లచెర్వుకు తీసుకువచ్చి పరీక్షించగా మేలిమి బంగారం అని తేలిందని చెప్పారన్నారు. గత వారం రోజుల కిందట మరోసారి అనంతపురం జిల్లాకు వెళ్లి రూ.3 లక్షలతో బంగారం కొనుగోలు చేసి, దానిని స్థానికంగా తీసుకువచ్చి పరిశీలించినట్లు శంభిరెడ్డి తెలిపారు. నకిలీ బంగారం అని తేలటంతో తాను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శంభిరెడ్డి తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.



శంభిరెడ్డి కొనుగోలు చేసిన నకిలీ బంగారం గొలుసు

తక్కువ ధరకు కొని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి

- ఒకరు సస్పెన్షన్, ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు

రాజాపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు రైతుల ఉంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రలో దళారులు విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని దూది వెంకటాపూర్ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాల శాఖ అధికారులు మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు సన్న, చిన్నకారు రైతుల నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఐకేపీ కేంద్రానికి తరలించి విక్రయాలు జరుపుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో దీనిపై అధికారులు విచారణ నిర్వహించారు. విక్రయిస్తున్నది వాస్తవమేనని రైతులు అధికారులకు వివరించారు. గ్రామానికి చెందిన వ్యాపారులైన నక్కిర్తి కనకరత్నం, నక్కిర్తి లక్ష్మి, వస్పరి మహేశ్‌లపై కేసు నమోదు చేసి 400 క్వింటాళ్ల ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏఈవోను సస్పెండ్ చేస్తూ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని విధుల నుంచి తొలగించారు. అక్రమంగా కొనుగోలు కేంద్రాల్లో వ్యాపారులు ధాన్యం విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ అనిత, వ్యవసాయాధికారి పద్మజ రైతులకు సూచించారు.



దూదివెంకటాపూర్ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న వివిధ శాఖల అధికారులు

గంజాయి స్వాధీనం

భువనగిరి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం గంజాయి విక్రయిస్తున్న స్థానికుడైన ఎండీ ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి తెచ్చిన గంజాయిని బస్టాండ్‌లో విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో నిందితుడిని పట్టుకొని ఆయన వద్ద నుంచి 0.138 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఆవుల పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 16 ఆవులను మంగళవారం స్వాధీనం చేసుకుని హైదరాబాద్ జియాగూడలోని గోశాలకు అప్పగించినట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్‌కు ఆవులను తీసుకెళ్తున్న ట్రక్కును తనిఖీ చేయగా ఆవుల అక్రమ రవాణా వెలుగుచూసిందన్నారు. ఈ మేరకు నిందితుడు మరిశెట్టి సత్తయ్యను అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాహిత మిస్సింగ్ కేసు

యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన ధీరావత్ బాబ్లి కుటుంబసభ్యులతో కలిసి దంత వైద్యశాలకు వెళ్లేందుకు సోమవారం భువనగిరి బస్టాండ్‌కు వచ్చింది. బస్సు దిగిన అనంతరం కుమారుడితో కలిసి మూత్రవిసర్జనకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బస్టాండ్ పరిసరాలు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

చిలుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతి చెందాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామంలో మంగళవారం జరిగింది. బాధిత రైతులు గన్నా వెంకటేశ్వర్లు, గన్నా సత్యనారాయణ, గోపిదేశి ముత్తయ్యలు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే మేత కోసం పశువులను పొలాలకు వదలగా, గ్రామ పరిధిలోని సబ్బుల ఫ్యాక్టరీ గోదాం వెనుక గల పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. వీటి విలువ రూ.2 లక్షలకుపైనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

తుక్కాపురంలో..

భువనగిరి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురంలో మంగళవారం జరిగింది. రూరల్ సీఐ చంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం రాసాల రమేష్ గేదెలు మేత మేస్తూ హర్షవర్ధన్ పొలంలోకి వెళ్లాయి. హర్షవర్ధన్ తన పొలం చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. రమేష్‌పాడి గేదె ఆ ఫెన్సింగ్‌కు ఉన్న తీగలకు తగిలి మృతి చెందింది. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఫీజులు నియంత్రణలో ఉండాలి

ఆంధ్రజ్యోతి జన వాక్యం

డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల మాదిరిగానే అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కూడా ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. ముఖ్యంగా ఫీజుల నియంత్రణపై ముసాయిదా చట్టం సిద్ధం చేసింది. దీనిపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ ముసాయిదా చట్టంతో మేలు జరుగుతుందని, ముసాయిదా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. ఫీజులు తక్కువ ఉంటే విద్యార్థులకు మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు.

● ఆంధ్రజ్యోతి- సూర్యాపేటటౌన్

ముసాయిదా చట్టంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీకళాశాలల్లో మాదిరిగా ఇంటర్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ ముసాయిదా చట్టం అమలు చేస్తే ఎంతో మందికి మేలు జరుగుతుంది. పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. విద్యారంగంలో అనేక సంస్కరణలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యారంగంలో కార్పొరేట్ వ్యవస్థ ఆగడాలను అరికట్టేలా చూడాలి. అనుమతులు లేని కళాశాలలు, పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పేద విద్యార్థులకు కళాశాలల్లో కొన్ని సీట్లు కేటాయించాలి.

● నిద్ర సంపత్‌నాయుడు, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు

ఫీజులు తక్కువగా ఉండాలి



ప్రైవేట్ కళాశాలల్లో చదవాలంటే అధిక ఫీజులతో ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పేదలకు కళాశాలల్లో ఉచిత సీట్లకు పెద్దపీట వేయాలి. విద్యాహక్కు చట్టం అమలులో లేక ఇబ్బంది ఎదురవుతోంది. అమ్మానాన్న కలలను సాకారం చేయలేక అనేక మంది విద్యార్థులు ఫీజుల భారంతో విద్యకు దూరమవుతున్నారు.

● సూరారపు ప్రేమ్‌కుమార్,ఇంటర్ విద్యార్థి సూర్యాపేట

చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. పిల్లలను చదివించాలంటే ఫీజులు భయంగా ఉంది. అధిక ఫీజులతో చదువులు చదివించలేక పోతున్నాం. గతంలో ఇలాంటి పేరెంట్స్, టీచర్స్ కమిటీలు ఉన్నా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం తీసుకొస్తున్న ఫీజు నియంత్రణ ముసాయిదా చట్టం మాలాంటి నీరుపేదలకు వరంగా ఉంటుంది.

● చిప్పలపల్లి వెంకటయ్య, సూర్యాపేట

కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలి



పేరెంట్స్ టీచర్స్ కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలి. 10మందితో కూడిన పేరెంట్స్ టీచర్స్ కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం ఉంటే చట్టం అమలు పటిష్ట అమలుకు అవకాశం ఉంటుంది. ఇందులో నలుగురు పేరెంట్స్, ముగ్గురు టీచర్స్, ఒకరు కళాశాల యాజమాన్యంతో పాటు ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులు ఉండాలి. కార్పొరేట్ కళాశాల ఆగడాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలి.

● వెన్నెల, విద్యార్థి సంఘం నాయకురాలు

నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు.

అలసి సొలసి..



ఎండ తీవ్రత అధికమవడంతో పశు పక్ష్యాదులు ఆపసోపాలు పడుతున్నాయి. ఎండ వేడిమికి తాళలేని కొన్ని వానరాలు(కోతులు) మంగళవారం ఇలా తలదాచుకున్నాయి. యాదగిరిగుట్టలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రొటోకాల్ కార్యాలయం పక్కన గోడకు తీర్చిద్దిదిన గజేంద్రుల ప్రతిమల మధ్య ఉన్న రథం నీడన సేదతీరాయి.

● యాదగిరిగుట్ట, ఆంధ్రజ్యోతి.

విత్తన పంపిణీకి సమాయత్తం



» టీజీ సీడ్స్ ఆధ్వర్యంలో నేటినుంచి పంపిణీకి ఏర్పాట్లు
» ఉమ్మడి జిల్లాలో 104 కేంద్రాల ద్వారా పంపిణీ
» సహకార సొసైటీలు, ఏఆర్ఎస్‌కేలు, డీసీఎంఎస్‌ల ద్వారా పంపిణీ
» 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

వానాకాలం సాగు కోసం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(టీజీ సీడ్స్) విత్తనాలు అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని 104 కేంద్రాల ద్వారా ఈ నెల 15 నుంచి విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. 73 పీఏసీఎస్ కేంద్రాలు, 24 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఐదు డీసీఎంఎస్ కేంద్రాలు, ఒక ఎఫ్‌పీవో కేంద్రం, టీజీ సీడ్స్ కార్యాలయం ద్వారా రైతులకు విత్తనాలు సరఫరా చేయనుంది.

- ఆంధ్రజ్యోతి - నిడమనూరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు

వరి 4,300 క్వింటాళ్లు
జీలుగ, 6,000 క్వింటాళ్లు
జనుము 690 క్వింటాళ్లు
కంది 20 క్వింటాళ్లు
వరి సన్నరకం 3500 క్వింటాళ్లు
వరి దొడ్డు రకం 800 క్వింటాళ్లు
వరి బీపీటీ 5204 క్వింటాళ్లు
జేజీఎల్ 27356 క్వింటాళ్లు

జిల్లా వారీగా కేటాయించిన విత్తనాలు

నల్లగొండ జిల్లాకు 4120 క్వింటాళ్లు
యాదాద్రి జిల్లాకు 1070 క్వింటాళ్లు
సూర్యాపేట జిల్లాకు 1500 క్వింటాళ్లు

పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు 50శాతం సబ్సిడీపై అందిస్తుండగా, వరి, అపరాలకు మాత్రం సబ్సిడీ లేదు. కానీ టీజీ సీడ్స్ కార్యాలయం సొంత విక్రయ కేంద్రాల్లో రైతులు నేరుగా విత్తనాలు కొనుగోలు చేస్తే ఆరు శాతం వరకు తగ్గింపు ఉంటుంది. రైతులంగా కలిసి రెండు టన్నుల విత్తనాలు కొనుగోలు చేస్తే ఆరు శాతం డిస్కౌంట్‌తో పాటు ఎలాంటి రవాణా ఖర్చులు లేకుండా నేరుగా ఆయా గ్రామాలకు పంపించనున్నారు. యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. వానాకాలం సీజన్‌లో అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. వివిధ రకాలైన మేలు రకం వరి విత్తనాలతో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, కంది విత్తనాలు కూడా అందుబాటులో ఉంచింది. రైతుల అవసరాల మేరకు పెసర, మినుము విత్తనాలు కూడా తెప్పించేందుకు చర్యలు తీసుకుంది. వరి విత్తనాలు బీపీటీ 5204, జేజీఎల్ 27356 తదితర రకాల విత్తనాలు కిలోకు రూ.45.50 ఉంది. 25 కిలోల సంచులు రూ.1137.50లకు లభిస్తున్నాయి. ఆర్ఎన్నార్ 15048 రకం వరి విత్తనాలు కిలో రూ.46.60 ఉంది, ఇవి 15కిలోల సంచుల్లో విక్రయిస్తున్నారు. దొడ్డు రకం వరి విత్తనాలు ఎంటీయూ1010, కేఎన్ఎం 118 రకం ఉన్నాయి. జీలుగ విత్తనాలు కిలో రూ.142.50, జనుము కిలో రూ.125.50లకు విక్రయిస్తున్నారు. వీటికి 50 శాతం సబ్సిడీ ఉంది. జీలుగ 30 కిలోలు, జనుము 40కిలోల సంచుల్లో దొరుకుతున్నాయి. అదే విధంగా కంది విత్తనాలు కిలో రూ.120 కాగా నాలుగు కిలోల సంచుల్లో అందుబాటులో ఉన్నాయి.

వానాకాలం సాగుకు సమాయత్తం

వీటిని ఉమ్మడి జిల్లాలోని ఆయా పంపిణీ కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించనున్నారు. వీటితో పాటు పెసర, మినుములు కూడా తెప్పించేందుకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో లక్ష క్వింటాళ్ల వరకు సేకరించినందున, విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదని, రైతుల అవసరం మేరకు తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. దుక్కులు కూడా దున్నుతున్నారు. సాగుకు విత్తన ఎంపికే ప్రధానం. మేలురకం విత్తనాలతో సాగు చేస్తేనే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించి, నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు అధికారుల సూచిస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం



వానాకాలం సీజన్ సాగు కోసం ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి అవసరమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు ఆయా జిల్లాల్లోని పంపిణీ కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేయడం జరిగింది. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడమే విత్తనాభివృద్ధి సంస్థ ముఖ్య లక్ష్యం. రైతుల మేలు కోసం సంస్థ అందిస్తున్న విత్తన డిస్కౌంట్ పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలి.

- టి. వినయ్, రీజనల్ మేనేజర్, టీజీ సీడ్స్

మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



పంటలు సాగు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేస్తేనే అధిక దిగుబడులు పొందగలుగుతారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఆకర్షణీయమైన ప్యాకింగులు చూసి మోసపోవద్దు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

- విజయచంద్ర, ఏఈవో, నిడమనూరు

వానాకాలం సాగుపై ఆశలు



యాసంగి సీజన్ ముగియడంతో వానాకాలం సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకుని సేద్యానికి సిద్ధమవుతున్నాం. ప్రతి సీజన్‌లో కొందరు రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోవాల్సి వస్తుంది. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి ప్రవేశించకుండా అధికారులు చూడాలి. విత్తనాల ఎంపికపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. రైతులకు అవసరమైన మేలురకం విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- చింతకుంట్ల మల్లారెడ్డి, రైతు, బొక్కమంతలపహాడ్.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

● టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ● రూ.34 కోట్లు విడుదల చేయాలని వినతి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మునుగోడు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు రూ.34 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో హైదరాబాద్‌లోని టీజీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర కార్యాలయంలో సీఎండీ ముషారఫ్‌ను కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వివరించారు. మునిసిపాలిటీలు, గ్రామాల్లో నెలకొన్న లో-ఓల్టేజీ సమస్య, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలని కోరారు. లూజ్ లైన్లు, నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరారు. వెనుకబడిన మునుగోడును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అన్ని రకాల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వ్యవసాయాధిరిత ప్రాంతమైనందున రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ శాఖలో విధుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతికి పాల్పడుతున్నారని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, ప్రజలను ఇబ్బంది పెడుతున్న సంఘటనలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు.

సీఎండీ దృష్టికి సమస్యలు

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తమ దృష్టికి తెచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎండీ ముషారఫ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలన్నారు. అగ్రికల్చర్ డీపీఆర్‌లకు ఏబీ స్విచ్‌లు పెంచుతామని, మే, జూన్ మాసాల్లో ఏబీ స్విచ్‌లను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, చౌటుప్పల్ మాజీ ఎంపీపీ చిల్కూరీ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జి పబ్బు రాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ, బోయ దేవేందర్ పాల్గొన్నారు.

బయోమైనింగ్ విధానం అమలు చేయాలి



డంపింగ్ యార్డులో అధికారులకు సూచనలిస్తున్న జేడీ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణకు బయోమైనింగ్ విధానం ఎందుకు అమలుచేయడం లేదని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. దశాబ్దాల క్రితం నియమితులైన ఎన్ఎంఆర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు అవసరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి పట్టణంలోని డంపింగ్ యార్డును సందర్శించారు. బయో మైనింగ్ విధానంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, స్థలం సరిపోదనే సమస్య ఉండదన్నారు. చెత్త నుంచి ఎరువుల ఉత్పత్తి చేయొచ్చని, రీసైక్లింగ్ జరపొచ్చన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు బయో మైనింగ్‌కు విధాన అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డంపింగ్ యార్డును పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాలను పచ్చని చెట్లతో నింపాలన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, టీపీవో కట్టెబోయిన అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్వో జ్ఞానేశ్వరి, అధికారులు శంకర్, చరణ్ తేజ, శ్వేత, షెహబాజ్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం 512 అడుగులు



నాగార్జునసాగర్, మే 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590.00 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుత నీటిమట్టం 512.90అడుగులు(136.6461 టీఎంసీలు)గా నమోదైంది. ఎడ మకాల్వ, కుడి కాల్వ, విద్యుత్‌కేంద్రం ద్వారా నీటి విడుదల లేదు. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450 క్యూసెక్కులు, వరద కాల్వకు నీటి విడుదల లేదు. ఎగువ నుంచి నీటి రాక లేదు.

వేసవిలోనూ నిండు కుండలా..

● రెండు సీజన్లకు సాగు నీరిచ్చినా తగ్గని మూసీ ప్రాజెక్టు నీరు ● పెరుగుతున్న నీటి మట్టం



నీటితో తొణికిసలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు మండుతున్న పరిస్థితుల్లోనూ మూసీ ప్రాజెక్టు నీటితో నిండుకుండలా తొణికిసలాడుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటివనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఈ ఏడాది తరగని నీటినిల్వలతో కళకళలాడుతోంది. ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో దాదాపు 35వేల ఎకరాల ఆయకట్టుతో పాటు అంతే విస్తీర్ణంలో అక్రమంగా పంపుసెట్లతో నీటి తరలింపు ద్వారా నాన్ ఆయకట్టు భూముల్లో పంటలను రైతులు సాగు చేశారు. అయినా ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాలు, హైదరాబాద్ నుంచి నిరంతరాయంగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 634.20అడుగులు(2.04టీఎంసీలు)గా ఉంది. గత ఏప్రిల్ 6న యాసంగి సీజన్ పంటలకు సాగు నీటి విడుదలను నిలిపి వేసే నాటికి 623.50అడుగులు (0.71టీఎంసీలు)గా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం 37 రోజుల్లో 10.07అడుగుల మేర పెరిగి ప్రస్తుతం 634.20 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి 489.11 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 629.15అడుగులుగా ఉండగా ఈ ఏడాది 5అడుగుల మేర నీరు అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అకాల వర్షం కురిసి ఇన్‌ఫ్లో ఏమాత్రం పెరిగినా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే వీలుంది. దీంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ యంత్రాంగం ప్రాజెక్టు గేట్ల నిర్వహణ సులువు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు క్రస్టు, రెగ్యులేటరీ గేట్లు, గేట్లను ఎత్తేందుకు వినియోగించే విద్యుత్ మోటార్ల పుల్లీలకు ఆయిలింగ్, గ్రీజింగ్ పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవాలి



శివారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్

భూదాన్‌పోచంపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని తెలుసుకుని రైతులు సాగు ఖర్చు తగ్గించి నికర ఆదాయం పెంచుకోవాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్, బాలచందు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులకు వరి సాగులో మెలకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ. శైలజ, ఏఈవో శిరీష, రామకృష్ణ, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభం

మునుగోడు రూరల్: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మునుగోడు క్లస్టర్ హార్టికల్చర్ ఆఫీసర్ విద్యాసాగర్ తెలిపారు. మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఆర్థిక స్థితిగతులు పెంపొందించేందుకు పంట సాగు ఉపయోగపడుతుందన్నారు. ఆయిల్ పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. బిందు సేద్యంపై ఎస్సీలకు ప్రభుత్వం 100శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఎకరానికి ప్రభుత్వం నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.4200 ఇస్తుందన్నారు. అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, ఏఈవో నిఖిల్, ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, మాజీ సర్పంచ్ నందిపాటి రాధా రమేష్, గ్రామ రైతులు కోనేటి భూమయ్య, పాండు, మారయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునకొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



నాగార్జునకొండలోని బౌద్ధ స్తూపం వద్ద బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను మంగళవారం మైసూరులోని సారా మఠానికి చెందిన నావాంగ్ జంగ్నీ, ఆయన శిష్యులు సందర్శించారు. మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా ప్రత్యేక సోమవారం పూజా కార్యక్రమానికి వచ్చిన వారు మంగళవారం పర్యాటకశాఖ లాంచీలో నాగార్జునకొండకు చేరుకున్నారు. అక్కడ మ్యూజియం, సింహళీయం, అశ్వమేధ యాగశాల, స్నాన వాటికలు, బౌద్ధమత స్తూపాలు, నమూనాలను తిలకించారు. నాగార్జునకొండపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారివెంట బుద్ధవనం సీనియర్ అసిస్టెంట్ ఉన్నారు.

ధ్రువీకరణపత్రాల పరిశీలన

భువనగిరి (కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేస్తూ వీఆర్వో వ్యవస్థ రద్దుతో ఇతర శాఖలకు వెళ్లిన వారిని గ్రామ పాలనాధికారుల పేరుతో తిరిగి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పలు శాఖలకు వెళ్లిన వీఆర్వోలు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జీపీవో కోసం యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా 189 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మంగళవారం అధికారులు పరిశీలించారు. వీఆర్ఏ, వీఆర్వో, కారుణ్య ఇతర ద్వారా విధులు వారి అర్హతలు, అందుకు ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించారు.

ఆటో డ్రైవర్ల హామీలు అమలు చేయాలి

భువనగిరి గంజ్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆటో రథయాత్ర మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ.12వేలు ఇవ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. రూ.8వేలు ఉన్న ఇన్సూరెన్స్‌ను రూ.వెయ్యికి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు కొమ్ము జగదీష్‌బాబు, జై భీమ్ ఆటో వెల్ఫేర్ సొసైటీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కర్తాల శ్రీనివాస్, ఎస్‌కే నిజాం, బింగి సురేష్, మాటూరి నాగరాజు, తారాల ఉపేందర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించే వ్యాపారులకు జరిమానా

నేరేడుచర్ల, మే 13: నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని పలు వాణిజ్య సంస్థల్లో మునిసిపల్ సిబ్బంది మంగళవారం తనిఖీ చేసి 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న కవర్లను వినియోగిస్తున్న వారికి జరిమానా విధించారు. మునిసిపాలిటీ మేనేజర్ షేక్ యాకూబ్ తన సిబ్బందితో బేకరీలు, టిఫిన్ సెంటర్లు, కిరాణ షాపులు, సూపర్ మార్కెట్లను తనిఖీ చేసి నిబంధనలు పాటించనివారికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, ప్రవీణ్, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కాంటాలు త్వరితగతిన పూర్తి చేయాలి

మద్దిరాల, మే 13(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు త్వరితగతిన వేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాంటాలు అయిన బస్తాలను తడవకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వహిద్దీన్, తరుణ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోదాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున బుధవారం మండలంలోని దోరకుంట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ రూరల్ ఏఈ సైదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల, మే 13: తిరుపతిలో ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వ హించనున్న అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలను విజయ వంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో జాతీయ మహాసభల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లా డారు. సమాజ చైతన్యమే యువతకు లక్ష్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరికె భరత్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వివేక్ పాల్గొన్నారు.

అత్యవసరమైతే ఉగ్గబట్టాల్సిందే

రద్దీ ప్రదేశాల్లో మరుగుదొడ్లు లేక ప్రజల అవస్థలు

జిల్లా కేంద్రంలో ముత్రశాలలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలల లేనందున వివిధ పనుల నిమిత్తం నిత్యం సూర్యాపేట వచ్చే ప్రజలు ఇంటికి పోయే వరకు ఉగ్గబట్టుకుంటున్నారు. పేరుకు జిల్లా కేంద్రం అయినప్పటికీ పట్టణంలో ముత్రశాలలు కరువయ్యాయి.

(-సూర్యాపేట టౌన్ - ఆంధ్రజ్యోతి)

చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యాపారాల నిమిత్తం, వివిధ పనుల నిమిత్తం, నిత్యం అనేక మంది సూర్యాపేట జిల్లా కేంద్రానికి వస్తుంటారు. వీరంతా మూత్రశాలకు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడో ఒక చోట అరకొరగా ముత్రశాలలు ఉండగా, వాటి నిర్వహణ కొరవడినందున వినియోగించేవారు తక్కువగాఉన్నారు. జిల్లా కేంద్రంలో మొత్తం 48వార్డులు ఉన్నాయి. కేవలం కొన్ని వార్డుల్లో మాత్రమే మూత్రశాలలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో పురుషులు సిగ్గు విడిచి బహిరంగ ప్రదేశాల్లో కానిస్తున్నారు.

జనావాసాలకు దూరంగా మూత్రశాలలు

జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 10మరుగుదొడ్లను నిర్మించారు. ఇవి జనావాసాలకు దూరంగా ఉన్నాయి. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాల్లో నిర్మించారు. కుడకుడ శివారు ప్రాంతాల్లో, ఎన్టీఆర్ చెరువు కట్ట, జనగాం ఎక్స్‌రోడ్డు, సద్దుల చెరువు బతుకమ్మ ఘాట్, ఎన్టీఆర్ పార్క్, జమ్మిగడ్డ ప్రాంతంతో పాటు పలు శివారు ప్రాంతాల్లో ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేని ప్రాంతాల్లో మరుగుదొడ్లను నిర్మించారు. పట్టణంలో ఎక్కడా మరుగుదొడ్లు లేవు. ముఖ్యంగా పాత బస్‌స్టేషన్, శంకర్‌విలాస్, వాణిజ్య భవన్, పీఎస్ఆర్‌సెంటర్, కోర్టు చౌరస్తా, మహాత్మాగాంధీ రోడ్డు వంటి రద్దీ ప్రదేశాల్లో మూత్రశాలలు లేవు. అక్కడక్కడ ఒకటో, రెండో ఉన్నా వాటి నిర్వహణ కొరవడింది.

వ్యాపారులకు తప్పని ఇబ్బందులు

జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయలు విక్రయించడానికి వివిధ గ్రామాల నుంచి అనేక మంది వస్తుంటారు. వీరిలో మహిళలు అధికంగా ఉంటున్నారు. వీరంతా రోడ్డుపై కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్నారు. రోజంతా అక్కడే ఉంటుండడంతో మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 180 మంది పైగా మహిళా కూరగాయల వ్యాపారులు ఉన్నారు. వీరంతా రోజూ ఇబ్బంది పడుతున్నారు. అయితే గతంలో మునిసిపల్ ఆధ్వర్యంలో లక్షల రూపాయవల వ్యయంతో షీ టాయిలెట్ బస్సును కేటాయించి, ఈ మహిళా వ్యాపారులు ఉంటున్న ప్రాంతంలో ఏర్పాటు చేశారు.. ఆ బస్సు రెండేళ్లుగా ఎక్కడ ఉందో కూడా తెలియడం లేదు. అధికారుల స్పందించి పట్టణంలో రద్దీ ప్రదేశాల్లో మూత్రశాలల నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



సూర్యాపేటలో బహిరంగ ప్రదేశంలో ముత్ర విసర్జన చేస్తున్న వ్యక్తి

మూత్రశాలలు నిర్మించాలి



మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో రద్దీ ప్రదేశాల్లో మూత్రశాలలు నిర్మించాలి. ముత్రశాలలు లేక మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది వివిధ పనుల నిమిత్తం సూర్యాపేటకు వచ్చి మూత్రశాలలు లేక ఇంటికి తిరిగి వెళ్తున్నారు.

● ఎర్ర అఖిల్‌కుమార్

పరిశీలించి ఏర్పాటు చేస్తాం



పట్టణంలో మూత్రశాలలు ఎక్కడెక్కడో అవసరమో పరిశీలిస్తాం. మూత్రశాలల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

● బి.శ్రీనివాస్, మునిసిపల్‌కమిషనర్, సూర్యాపేట

ధరల నియంత్రణలో పాలకులు విఫలం

మఠంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య పాండునాయక్, పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తున్న కేంద్రం ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలను పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని ఎదుర్కొలేక ప్రజలకు న్యాయం చేయలేక అప్పులపాలైందని అన్నారు. కేంద్రానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు వినోద్, బాలిబాయి, వెంకటేశ్వర్లు, రన్‌మియా, దాను, సేవ్యి, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసానికి' సిబిల్ స్కోర్ లింకు పెట్టొద్దు



తుంగతుర్తిలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, మే 13, (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఉంటేనే లోన్ ఇస్తామని చెప్పడం యువతను మరోసారి మోసం చేయడమేనని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం తుంగతుర్తి బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం సిబిల్ స్కోరు ఉండాలని ప్రకటించడం యువత ఆశలపై నీళ్ల చిల్లిన చందంగా ఉందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని, అర్హులైన యువకులందరికీ యువ వికాసం పథకం వర్తింపజేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గునిగంటి సతీష్ పాల్గొన్నారు.

తెలంగాణలో బలమైన శక్తిగా టీడీపీ



కోదాడలో సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కోదాడ, మే 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బలమైన శక్తిగా టీడీపీ ఎదుగుతోందని ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు రాంరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడలోని టీడీపీ కార్యాలయంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీడీపీ కోదాడ మండల అధ్యక్షుడిగా పిట్టల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా వేమూరి యోగేందర్‌ను నియమించారు. ఈ మేరకు శోభన్‌బాబుకు, యోగేందర్‌కు నియామకపత్రాలను రాంరెడ్డి అందజేసి మాట్లాడారు. ఇప్పటికే పలు పార్టీల కార్యకర్తలు టీడీపీలో చేరడానికి ఆసక్తిగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ మాజీ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ప్రభాకర్, బయ్యా నారాయణ, కొల్లు నర్సయ్య, గుండు నాగేశ్వరరావు, సాతులూరి గురవయ్య, చేపల శ్రీను, పల్లపు నాగేశ్వరరావు, ఉప్పగండ్ల శ్రీనివాసరావు, జనపనేని కృష్ణ, థామస్, సత్యనారాయణ, సురేష్, నరేష్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, షాబుద్దీన్, సహదేవ్, ప్రసాద్, సురేష్, అబీబ్, శ్రీనివాసరావు, నర్సింహారావు, రమేష్, ప్రవీణ్, రంగ, నాని, నాగేశ్వరరావు, ధనమూర్తి, ప్రసాద్, నాగేశ్వరరావు, సైదులు,, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, వెంకటప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరయ్య కుటుంబానికి ఆర్థికసాయం



వీరయ్య కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, తూముల ఇంద్రసేనారావు

పెన్‌పహాడ్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తాళాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గోపాల్‌దాస్ వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పంపిన ఆర్థికసాయాన్ని మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం అందజేశారు. అ కార్యక్రమంలో తూముల ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, జూకొండ గణేష్, నెమ్మాది కృష్ణ, శ్రీరాములు, రాంబాబు, రవి, గురుస్వామి, గణేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక నిర్ధారణ శిబిరం నేడు

హుజూర్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ప్రత్యేక నిర్ధారణ శిబిరాన్ని పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఈ నెల 14న ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం నాయకులు పిచ్చయ్య, వీరాంజనేయులు తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన దివ్యాంగులు ప్రత్యేక నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తీరుమారని పోలీస్

(5వ పేజీ తరువాయి)

వారి సమస్యలపై ఫిర్యాదులు చేసిన వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు.

మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో 21 ఏసీబీ కేసులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు మూడేళ్లలో 21 కేసులు నమోదు చేశారు. అందులో పలు కేసులు రెడ్‌హ్యాండెడ్‌గా డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నవి. మరి కొన్ని డబ్బులు డిమాండ్ చేసిన కారణంగా కేసులు నమోదుచేశారు. 2023లో నాలుగు కేసులు, 2024లో 11 కేసులు, 2025లో ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదుచేశారు. అందులో భాగంగా పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖ, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు.

డబ్బులు డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వండి

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేసినా, తీసుకునేందుకు ప్రయత్నం చేసినా, డబ్బులు తీసుకున్నా నేరమే. ఎక్కడైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబరు 1064, ఏసీబీ వాట్సాప్ నెంబర్ 9440446106కు సమాచారం ఇవ్వాలి. అవినీతి సహించవద్దు. అవినీతి అధికారులకు సహకరించవద్దు.

● జగదీష్‌చందర్, ఏసీబీ డీఎస్పీ

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న జడ శ్రీనివాస్‌యాదవ్

నేరేడుచర్ల, కోదాడ, గరిడేపల్లి, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, పెన్‌పహాడ్, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయ వంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం నేరేడుచర్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ జాని, రాములు, మట్టయ్య, శ్రీహరి, శోభన్ పాల్గొన్నారు.

● అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహారావు కోరారు. కోదాడలోని లాల్ బంగ్లాలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, వీరబాబు, విజయ్, సలీం, రవితేజ, కొండల్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



కోదాడలో పోస్టర్లువిడుదల చేస్తున్న ఇఫ్టూ నాయకులు

● దేశ వ్యాప్తంగా ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ యాకుబ్ కోరారు. గరిడేపల్లిలో పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవో ఆర్.సరోజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, గోపాలకృష్ణ, సత్యనారాయణ, గోపి, శేఖర్, పిచ్చయ్య, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● అసంఘటిత రంగ కార్మికులకు మోదీ ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల రమణ, పాపారావు, రమేష్, నర్సింహారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

● కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా డిమాండ్ చేశారు. మఠంపల్లిలో కరపత్రాలను నాయకులతో కలిసి ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, భూక్య సైదానాయక్,రవి, మైసయ్య, పిచ్చయ్య, రహీం, శ్రీను పాల్గొన్నారు.

● కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. మేళ్లచెర్వులో పలు కంపెనీలలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నాగేశ్వరరావు, వెంకన్న, శ్రీను, లక్ష్మణ్, కృష్ణ పాల్గొన్నారు.

● దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ కోరారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయనమాట్లాడారు. మూడమూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తోందని ఆరోపించారు. ఈ. కార్యక్రమంలో హమాలి సంఘం ముఠామేస్త్రీ భూక్యా జగపతి, కార్మికులు నూనావత్ పాండు, దరావత్ మంగ్య, కిషన్, కీమా, రమేష్, నాగు పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో కాంట్రాక్టర్ కార్మికులతో మాట్లాడుతున్న శీతల రోషపతి

కాటమయ్య కిట్లతో ప్రాణ రక్షణ

మఠంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్ గీత కార్మికులకు ఎంతో ఉపయోగమని రక్ష సేఫ్టీ కిట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కంఠమహేశ్వర స్వామి దేవాలయ సమీపంలో మేళ్లచెర్వు, మఠంపల్లి మండలాల గీత కార్మికులకు రక్ష సేఫ్టీ కిట్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు సేఫ్టీ కిట్ వినియోగిస్తే ఎటువంటి ప్రాణభయం ఉండదని, మోకు ప్రమాదవశాత్తు జారినా సేఫ్టీ కిట్ ప్రాణాన్ని కాపాడుతోందని తెలిపారు. ప్రతి గీత కార్మికుడూ సేఫ్టీ కిట్‌ను వినియోగించాలని డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ ముక్కు నాగేశ్వరావు, వంగా పవన్, శ్రీరామ్‌గౌడ్, వీరబాబు, గీత కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు వి.దాసుజోస్‌గౌడ్, మహేష్‌గౌడ్, హనుమంత్‌గౌడ్, శ్రీనివాస్, నర్సయ్య, సైదులు, వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.



రక్ష సేఫ్టీ కిట్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

ఇతర వ్యాపారులు కుండలు విక్రయించడం సరికాదు



మాట్లాడుతున్న కుండల విక్రయదారుల సంఘం సభ్యులు

సూర్యాపేట టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇతర వ్యాపారులు కుండలు విక్రయిం చడం సరికాదని కుండల విక్రయదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఖమ్మంపాటి మురళి, సిలివేరు తాయమ్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా 20కుటుంబాలవారు కులవృత్తి కుండలు విక్రయిస్తూ జీవిస్తున్నారని, కొందరు ఆర్య వైశ్య వ్యాపారులు తమ కుల వృత్తిని నిర్వీర్యం చేసేలా వ్యాపారంతో పాటు కుండలు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని దుర్భాషలాడటంత పాటు కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. మాకు న్యాయం జరిగే వరకు కుండలు విక్రయించకుండా బంద్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వాయిలాల నాగమ్మ, సిలివేరు వెంకటమ్మ, సిలివేరు నర్సమ్మ, గంగమ్మ, ఖమ్మంపాటి పెద్దశ్రీను, ఖమ్మంపాటి మధు, ఖమ్మంపాటి చిన్న శ్రీను, వాయిలాల ఉమ పాల్గొన్నారు

పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో నాయకులు

మఠంపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి సంఘం మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నం వీరమల్లు, ప్రధాన కార్యదర్శిగా కాంగర నర్సింహారావు, కోశాధికారిగా గోనె అంకయ్య, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా పిండిప్రోలు రామచంద్రయ్య, కన్వీనర్‌గా చిలివేరు అంజయ్య, గౌరవాధ్యక్షులు గా కుమారస్వామి, గోలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, కోటేశ్వరావు, జిల్లా సత్తయ్య, కృష్ణారావు, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసరావు, ప్రసాద్, పుల్లారావు, గోలి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు రాపోలు వీరమోహన్, శ్రీనివాసరావు, రావిరాల నర్సయ్య, గుర్రం మార్కెండేయ పాల్గొన్నారు.

నర్సుల సేవలు అమూల్యమైనవి

భానుపురి, మే 13(ఆంధ్రజ్యోతి): నర్సుల సేవలు అమూల్యమైనవని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నర్సింగ్ సూపరిటెండెంట్ వరమ్మ, రేణుకబాయ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుడేని ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోగులకు సేవలు అందిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం



మాట్లాడుతున్న దుర్గం ప్రభాకర్

సూర్యాపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మత మార్పిడిని నిరోధించాలన్న పిటీషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వడం హర్షనీయమని తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకుడు, బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18ఏళ్ల నిండిన ఎవరైనా తమకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చని సుప్రీంకోర్టు ఈ నెల 8వ తేదీన్ల తీర్పు ఇచ్చిందని అన్నారు. మత స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు శ్యాంప్రసాద్, ముల్లంగి జాకబ్‌రాజు, జలగం జేమ్స్, జాన్‌ప్రకాష్, యల్క ప్రభాకర్, బొక్క ఎలియారాజు, ఉట్కూరి రాజు, పంది మార్క్, ఏర్పుల కిస్టోఫర్, లాజర్, రూబెన్, బోయాజ్, యాకోబు, ప్రేమ్‌సాగర్, హోసన్న, సైమన్ పాల్గొన్నారు.

స్త్రీనిధి నిధుల అవకతవకలపై విచారణ



నారాయణగూడెం గ్రామంలో రికార్డులు పరిశీలిస్తున్న సీసీలు శైలజ, పద్మ, అకౌంటెంట్ స్వరూప

పెన్‌పహాడ్, మే 13, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణగూడెం గ్రామంలో స్త్రీనిధి నిధుల్లో అవకతవకలు జరిగాయని ఆ గ్రామస్థులు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సంఘ బంధాల సభ్యుల సమక్షంలో సోషల్ అడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు శైలజ, పద్మ, అకౌంటెంట్ స్వరూప, వీవోఏ ప్రమీల, సంఘం బంధం అధ్యక్షురాలు జయమ్మ, సుకన్య, పుల్లమ్మ, మంజుల, అశ్విని పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.10కోట్లు మంజూరు



బూరుగడ్డలో పనులు పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగడ్డ గ్రామం నుంచి హుజూర్‌నగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.10కోట్లను మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. బూరుగడ్డ డొంక రోడ్డు పట్టణంలోని గోదాం వరకు మూడు కిలోమీటర్లు డొంక రోడ్డు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసు, రాము, వీరబాబు పాల్గొన్నారు.